క్లుప్తంగా

ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న బీఎస్‌ఎస్‌ నాయకులు

జగిత్యాలటౌన్‌: పీఎం కిసాన్‌ సేవా కేంద్రాల ఏర్పాటును స్వాగతిస్తూ మోదీ చిత్రపటానికి భారత సురక్షాసమితి నాయకులు గురువారం తహసీల్‌ చౌరస్తాలో క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయరంగానికి సంబంధించిన ఎరువులు, విత్తనాలు సహా అన్ని రకాల సేవలు ఒకేచోట అందించేలా దేశంలో మొత్తం 2.80 లక్షల కేంద్రాలను ఏర్పాటు చేయనుండగా తొలిదశలో గురువారం దేశంలో 1.25లక్షల కేంద్రాలు రాష్ట్రంలో 4 వేల పీఎం కిసాన్‌ సేవా కేంద్రాల ఏర్పాటుపై ప్రధాని మోదీ నిర్ణయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భారత్‌ సురక్షా సమితి నాయకులు ఏసీఎస్‌ రాజు, అక్కినపెల్లి కాశీనాథం, మాజీ కౌన్సిలర్‌ బండారి మల్లికార్జున్‌, వేముల దేవరాజం, ఒడ్డెపెల్లి మురళి, షీల గంగారాం, సిరిపురం గంగారాం, వనమాల సత్యనారాయణ పాల్గొన్నారు.

సత్యనారాయణకు ఘన నివాళి


నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు

జగిత్యాలజోన్‌: జగిత్యాల బార్‌ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది సత్యనారాయణ రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, ఆయన మృతికి బార్‌ అసోసియేషన్‌ గురువారం ఘన నివాళి అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. న్యాయవాదులు సత్యనారాయణతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చీటి రామకృష్ణారావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

కల్వర్టులో చిక్కుకున్న పోలీసు వాహనం


పోలీసు వాహనాన్ని తోస్తున్న స్థానికులు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కరీంనగర్‌ రోడ్‌లో పాల కేంద్రం వద్ద వర్షానికి భారీ వరద నీరు రావడంతో గురువారం ఉదయం పోలీసు వాహనం వరదలో చిక్కుకుంది. స్థానికుల సహాయంతో పోలీసు వాహనాన్ని బయటకు తీశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

జగిత్యాల జిల్లా కేంద్రంలోని బాలాజీ టాకీస్‌ వద్ద యావర్‌ రోడ్డులో గురువారం రాత్రి కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఇద్దరు వ్యక్తులు కారులో కొత్త బస్టాండ్‌ నుంచి పాత బస్టాండ్‌ వెళ్తుండగా, కారు అతి వేగంగా వెళ్లి, డివైడర్లను ఢీకొంది. దీంతో బెలూన్లు ఓపెన్‌ కావడంతో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీఆర్‌ఎస్‌ ఎన్నికల కో- ఆర్డినేటర్ల నియామకం

ధర్మపురి: రానున్న ఎన్నికలను పురస్కరించుకుని ధర్మపురి మండలంలోని వివిధ గ్రామాల నుం బీఆర్‌ఎస్‌ ఎన్నికల కోఆర్డినేటర్ల నియామకాన్ని చేపట్టారు. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి సూచనల మేరకు ధర్మపురితో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి గురువారం నియామకాలను చేపట్టారు. ధర్మపురి మండల బీఆర్‌ఎస్‌ అధికార ప్రతినిధిగా ఒడ్నాల మల్లేశంను నియమించారు. ఎన్నికల కో-ఆర్డినేషన్‌ సభ్యులుగా 40 మందిని నియమించారు.

తహసీల్దార్‌కు పదోన్నతి

గొల్లపల్లి: మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న దూలం మధుగౌడ్‌కు డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు చీఫ్‌ సెక్రటరీ శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా తనకు పదోన్నతి లభించడంపై మాట్లాడుతూ, తనకు అన్ని రకాలుగా సహకరించిన రెవెన్యూ అధికారులకు, సిబ్బందికి, మండల ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మూడు రోజులు మంచినీటి సరఫరా నిలిపివేత

మెట్‌పల్లి: పట్టణంలో భారీ వర్షానికి ఫిల్టర్‌బెడ్‌ సంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగినందున మూడు రోజుల పాటు నల్లాల ద్వారా మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు చైర్‌పర్సన్‌ రాణవేని సుజాత, కమిషనర్‌ జగదీశ్వర్‌గౌడ్‌ గురువారం తెలిపారు. అత్యవసర సేవల కోసం ప్రజలు 9866577636, 7995014919 నెంబర్లకు ఫోన్‌ చేయాలని పేర్కొన్నారు.

జోరు వాన..

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుధవారం నుంచి గురువారం ఎడితెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. జగిత్యాల జిల్లా కేంద్రం, కోరుట్ల పట్టణం, ధర్మపురి పట్టణం, అన్ని గ్రామాల్లో జోరు వాన కురిసింది. చెరువులు,కుంటలు నిండి అలుగు దుంకుతున్నాయి. పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కోరుట్ల పట్టణం నీట మునిగింది. భారీ వర్షాలకు పలు చెరువులకు గండ్లు పడ్డాయి. చాలా చోట్ల ఇళ్లు కూలిపోయాయి. చెరువులు, వాగులు ఉప్పొంగడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. పలు చోట్ల అధికారులు బాధితులకు పునరావాసం ఏర్పాటు చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. – సాక్షి, నెట్‌వర్క్‌


మెట్‌పల్లి 9 వ వార్డులో జలదిగ్బంధంలో చిక్కుకున్న ఇండ్లు


పెగడపల్లిలో ఇంట్లో చేరిన నీటిని తోడేస్తున్న మహిళలు


గంభీర్‌పూర్‌- తాండ్రాల గ్రామాల మధ్య ప్రమాదకరంగా కల్వర్టు


మెట్‌పల్లి: వరద నీటిలో చిక్కుకున్న వారిని రక్షిస్తున్న పోలీసులు


మల్లాపూర్‌ ఒడ్డెర కాలనీరోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు


గండి పడిన వేములకుర్తి గంగనాల మాటుకాలువ


ఉధృతంగా ప్రవహిస్తున్న కోరుట్ల పెద్దవాగు


మల్లాపూర్‌లో నీట మునిగిన పంటపొలాలు


చెరువును తలపిస్తున్న మల్యాల పోచమ్మ వాడ


బుగ్గారం: గండి పడిన ఎస్సారెస్పీ డీ-53 కాలువ


కమలాపూర్‌లో వర్షానికి కూలిన ఇల్లు


నర్సింగాపూర్‌-జగిత్యాల మధ్య రోడ్యాంపై ప్రవహిస్తున్న వరద


వెల్గటూర్‌: వర్షం ధాటికి కొట్టుకుపోయిన రోడ్డు


రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువకు గండిపడి వృథాగా పోతున్న నీరు

లోతట్టు ప్రాంతాలు జలమయం

- కోరుట్లలో వర్ష బీభత్సం
- వర్షం తాకిడికి ఇండ్లు ఖాళీ
- పునరావాస కేంద్రం ఏర్పాటు
- జాతీయ రహదారిపై నిలిచిన నీరు


కోరుట్ల మండలం నాగులపేట సైఫాన్‌ వద్ద వరద ఉధృతి


మునిగిన నాగులపేట నాగులమ్మ ఆలయం

కోరుట్ల: ఏకధాటిగా 24 గంటల పాటు కురిసిన భారీ వర్షానికి కోరుట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. కొన్ని చోట్ల ఇళ్ల చుట్టూ నీరు చేరి జనం అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొనగా మరికొన్ని చోట్ల ఇళ్లలోకి నీరు చేరడంతో జనం బంధువుల ఇళ్లకు తరలించారు. బుధవారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షానికి ఉదయమే కోరుట్ల పట్టణంలోని1, 25, 10, 11 వార్డుల్లో సుమారు 440 ఇళ్లు చుట్టూ నీరు వచ్చి చేరింది. తెల్లారేసరికి రోడ్లపైన ఇళ్ల చుట్టూ నీరు చేరడంతో నిత్యావసర సరుకుల కోసం జనం అడుగుబయటపెట్టలేని పరిస్థితి నెలకొంది. పట్టణ శివారులోని కంచరకుంట నుంచి వచ్చిన నీరు మద్దుల చెరువు మినీట్యాంక్‌ బండ్‌ మత్తడి దూకి పెద్ద ఎత్తున అయిలాపూర్‌ రోడ్‌ మీదుగా ప్రకాశం రోడ్‌, ఝాన్సీరోడ్‌, కల్లూర్‌రోడ్‌, ఆనంద్‌ నగర్‌ ఏరియాల్లోకి వచ్చి చేరింది. ముత్యాల వాడలో పలు ఇళ్లలో నీరు చేరగా వారిని జేసీబీ సాయంతో వర్షపు నీటి నుంచి బయటకు తెచ్చి బంధువుల ఇళ్లకు చేర్చారు. వర్షపు నీటి ముంపులో ఇబ్బందులు పడుతున్న ప్రజలను బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ నాయకులు కలిసి ధైర్యం చెప్పారు. అవసరమైన సాయం అందిస్తామన్నారు.

కోరుట్ల మండలంలో..

కోరుట్ల రూరల్‌: కోరుట్ల మండలంలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు, ఒర్రెలు పొంగి ప్రవహించాయి. మండలంలో ప్రవహించే పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో సంగెం, యెఖీన్‌పూర్‌, కోరుట్ల,నాగులపేట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కల్లూర్‌ వాగు ఉప్పొంగి ప్రవహించటంతో కోరుట్ల నుంచి కల్లూర్‌ మీదుగా పైడిమడుగు, రాయికల్‌ వెళ్లే రహదారిపై రాకపోకలు స్తంభించాయి. పైడిమడుగు వాగు ఉప్పొంగి హైలెవల్‌ వంతెనపైనుంచి ప్రవహహిస్తుండటంతో కోరుట్ల-రాయికల్‌ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.అయిలాపూర్‌-ధర్మారం గ్రామాల మధ్య వాగు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో కోరుట్ల నుంచి మల్లాపూర్‌ మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి.

పొంగిపొర్లుతున్న వాగులు


దరూర్‌ రెడ్డి ఫంక్షన్‌హాల్‌ వద్ద నీటమునిగిన రహదారి


చిల్వకోడూర్‌లో నీట మునిగిన పొలాలు

జగిత్యాలరూరల్‌:గత వారం రోజులుగా జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో జగిత్యాల రూరల్‌, అర్బన్‌ మండలాల్లో ఉన్న వాగులు, వంకలు పొంగిపొర్లడంతో పాటు పంట పొలాలు నీటమునిగిపోయాయి. జగిత్యాల అర్బన్‌ మండలం పెర్కపల్లి, రూరల్‌ మండలం హన్మాజీపేట గ్రామాల మధ్యనున్న బొల్లెవాగు తీవ్ర ఉధృతంగా ప్రవహించడంతో పొరండ్ల, రంగపేట వైపు రాకపోకలన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. హన్మాజీపేట-పొరండ్ల శివారులోని కల్వర్టు వద్ద భారీగా వరద నీరు రావడంతో రోడ్డు తెగిపోయింది. జగిత్యాల రూరల్‌ మండలం జాబితాపూర్‌ శివారులోని బ్రిడ్జి వద్ద భారీగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షాలకు జగిత్యాల రూరల్‌ మండలంలో ఆరు ఇళ్లు నేలమట్టమైనట్లు తహసీల్దార్‌ నవీన్‌ తెలిపారు.

బుగ్గారం: మండలంలో కురిసిన జోరు వానకు వాగులు,వంకలు పొంగిపొర్లాయి.పలు గ్రామాలలోని లోతట్లు ప్రాంతాల్లో నీరు నిలిచి స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.బుగ్గారం మండలంలోని యశ్వంతరావుపేట,గంగాపూర్‌ గ్రామాల మధ్య రహదారి కోతకు గురవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.ధర్మపురి-జగిత్యాల మధ్య రహదారి కోతకు గురవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.అలాగే బుగ్గారం మీదుగా వెలటూర్‌ మండలం వరకు సాగునీటిని సరఫరా చేసే డీ53 కెనాల్‌కు చందయ్యపల్లె సమీపంలో గండిపడింది.దీంతో సమీపంలోని పొలాలు నీట మునిగాయి.మండల కేంద్రంలోని ఊర చెరువు పూర్తిగా నిండి కట్టపై నుండి నీరు ప్రవహిస్తున్న క్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు స్పందించి చెరువుకు గండి కొట్టారు.

గొల్లపల్లి: ఏకదాటిగా కురుస్తున్న వర్షానికి గొల్లపల్లి మండలం అతాలాకుతలమైంది.మండలంలోని చిల్వాకోడూర్‌, వెన్గుమట్ల, బొంకూర్‌, తిర్మాళాపూర్‌, శ్రీరాముపల్లి గ్రామాల గుండా వెళ్లే వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీట మునిగాయి.ఈ నాలుగు గ్రామాల గుండ రాకపోకలు నిలిచి పోయాయి. వెన్గుమట్లలో వాగు ఉప్పొంగి ప్రవహించడంతో ఎస్సీ కాలనీ,బీసీ కాలనీ ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరడంతో ఇళ్లు ఖాళీ చేశారు. అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

అధైర్యపడొద్దు.. ప్రభుత్వం అండగా ఉంటుంది

మల్లాపూర్‌: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలతో, వరదలతో నష్టపోయిన ప్రజలు, రైతులు అధైర్యపడొద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు డాక్టర్‌ కల్వకుంట్ల సంజయ్‌కుమార్‌ అన్నారు. గురువారం మల్లాపూర్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటించి గోదావరినది వరద ఉధృతి, దెబ్బతిన్న రోడ్లను, చెరువులను ఆయన పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రైతులు, బాధిత ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అసాధారణ వర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని, నిరంతరం అప్రమత్తంగా ఉండి ప్రజలకు సాయం అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు బీఆర్‌ఎస్‌ మండల ప్రజాప్రతినిధులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. శివారు, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించి పునరావాస కేంద్రాల్లో బస ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాటిపెల్లి సరోజన, జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు కోమ్ముల జీవన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో రాయికల్‌, సారంగాపూర్‌, బీర్‌పూర్‌


పెంబట్లలో నీట మునిగిన పొలాలు


రాయికల్‌ పట్టణం ఇళ్లకు చేరిన వరద నీరు


సిరిపూర్‌లో ఎస్సారెస్పీ డీ -29 కాల్వకు గండి

సారంగాపూర్‌: సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండలాలు జలమయంగా మారాయి. పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. గ్రామాలు వరద నీటితో ముంచెత్తాయి. అర్పపల్లి-హబ్సీపూర్‌ గ్రామాల మధ్య రోడ్డు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జగిత్యాల -లచ్చక్కపేట, నాగునూర్‌, రంగపేట గ్రామాల మధ్య వంతెనపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఆయా గ్రామాలకు జిల్లా కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. సారంగాపూర్‌, బీర్‌పూర్‌ మండలాల ప్రజలకు చుట్టు ఉన్న వాగులు, వంకలు పొంగడం, కోనాపూర్‌ అప్రొచ్‌రోడ్డు తెగిపోవడం, అనంతారం వద్ద ఉధృతంగా వాగు ప్రవహించడంతో 32 గ్రామాలకు జిల్లా కేంద్రంతో రాకపోకలు నిలిచిపోయాయి. రఖ్యా(చెర్లపల్లి) గ్రామానికి సంబంధాలు తెగిపోయాయి.

నీట మునిగిన రాయికల్‌

రాయికల్‌: రాయికల్‌ పట్టణంతో పాటు మండలంలోని 32 గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రాయికల్‌ మండలం జలదిగ్బంధంలో ఉంది. మైతాపూర్‌, రామాజీపేట, సింగరావుపేట, ఇటిక్యాల, మూటపల్లి గ్రామాల్లోని కల్వర్టులపై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఎక్కడికక్కడే రాకపోకలు నిలిచిపోయాయి. రాయికల్‌ పట్టణంలోని పెద్దచెరువు మత్తడి నుంచి వరదనీరు 5,6,7 వార్డుల్లో ఇళ్లలోకి చేరడంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు మున్సిపల్‌ కమిషనర్‌ సంతోష్‌కుమార్‌ తెలిపారు.ఆలూరు చెరువులోకి వరద నీరు చేరడంతో కట్టపైనుంచి నీరు బయటకు రావడంతో ప్రజలు గురువారం జేసీబీల సహాయంతో మట్టిని నింపారు.

గోదావరి తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మల్లాపూర్‌: గోదావరినది తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్‌ రవీందర్‌, ఎస్సై నవీన్‌కుమార్‌, ఎంపీడీవో జగదీష్‌ అన్నారు. గురువారం మల్లాపూర్‌ మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో వరద ఉధృతిని మండల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఇళ్ల కూలిపోయిన వారికి పునరావాస కేంద్రాల్లో బస ఏర్పాటు చేసి ఆహారం అందించాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం

మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో గురువారం భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో నాయకులు పర్యటించి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో వారికి పునరవాసం కల్పించారు. సిరిపూర్‌ శివారులో గురువారం ఎస్సారెస్పీ ఉప కాలువ డీ-29 కెనాల్‌కు గండి పడింది.

వెల్గటూర్‌: వెల్గటూర్‌ మండలంలో కుండపోత వర్షానికి జన జీవనం స్తంభించింది. వరదల ఉధృతికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగిపొర్లడంతో మండలంలోని పలుగ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎస్సారెస్పీ డీ-53 కెనాల్‌ పక్కనున్న ఎస్సీ కాలనీ, దుబ్బల వాడ కాలనీలో ఇళ్లన్నీ నీట మునిగాయి.